సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 24 । జనవరి । 2023





**70.680 టీఎంసీల నీరు నిల్వ**

సోమశిల: జలాశయంలో సోమవారానికి 70.680 టీఎంసీలు ఉన్నాయి. 1,994 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నార్‌డెల్టాకు 2,520, ఉత్తరకాలువకు 550, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రా) | రూ.58,880 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,252 |
| 3 శాతం జీఎస్టీతో | రూ.5,410 |
| నవర (8 గ్రా) | రూ.43,280 |

గరిష్టం/కనిష్టం
29.3 /22.7

**వాతావరణం**

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 10 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. ఆ తర్వాత పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 66 శాతం ఉంది.

## న్యూస్‌రీల్

### సెబ్ సిబ్బంది బదిలీలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్ఈఓ శ్రీలక్ష్మి

నెల్లూరు (క్రైమ్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)లో విధులు నిర్వహిస్తూ మ్యూచువల్, స్పౌస్ కింద బదిలీలకు దరఖాస్తు చేసుకున్న 19 మంది సిబ్బందికి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా సెబ్ అధికారి (డీఎస్ఈఓ) కె. శ్రీలక్ష్మి కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సిబ్బంది తిరుపతి జిల్లా నుంచి నెల్లూరుకు, నెల్లూరు నుంచి తిరుపతికి మ్యూచువల్, స్పౌస్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బందికి సంబంధించిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏసీ రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్‌బాషా, కేపీ కిశోర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్


వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్‌కు 827 మంది విద్యార్థులకు 91 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నెల్లూరు నగరంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్‌కు 10,522 మంది విద్యార్థులకు 814 మంది గైర్హాజరయ్యారని, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

### నేటి నుంచి జేఈఈ మెయిన్ పరీక్ష

నెల్లూరు (టౌన్): జాతీయ విద్యా సంస్థలు ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించనున్న జేఈఈ మెయిన్ పరీక్ష ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు రెండు విడతల్లో జరగనుంది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. జిల్లాలోని విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్, రాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల సెంటర్లలో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను గంటన్నర ముందు నుంచే కేంద్రంలోకి అనుమతించనున్నారు. విద్యార్థులు అడ్మిన్ కార్డుతో పాటు గుర్తింపు కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తీసుకెళ్లాల్సి ఉంది. విద్యార్థులతో శానిటైజర్, వాటర్‌బాటిల్‌ను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు.

### బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- విడో చెక్కుల పంపిణీలో ఎస్పీ



బాధితురాలికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు (క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్పీ సీహెచ్ విజయారావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏడుగురు పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున విడో చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తూ మృతి చెందిన జి.భాస్కర్‌రావు కుమారుడు జితేంద్రకు, స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ ఎం.రమేష్ చెల్లెలు అమలావతికి, దిశ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన బి.రమేష్ సతీమణి బి.లక్ష్మీదేవికి, ఏఆర్ఎస్ఐగా పనిచేస్తూ మృతి చెందిన ఎ.వెంకటేశ్వర్లు సతీమణి పద్మావతికి, ఏఆర్‌హెచ్‌సీగా పని చేస్తున్న మృతిచెందిన ఆర్ వెంకటేశ్వరరావు కుమారుడు మోహన్‌తేజ, వి.సత్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మృతి చెందిన బి. మల్లికార్జున్‌రావు సతీమణి రాజేశ్వరి, స్కావెంజర్‌గా పని చేస్తూ మృతి చెందిన ఎస్.ఇరగాలమ్మ కుమారుడు వీరరాఘవులకు విడో ఫండ్ కింద చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నీ సదుపాయాలు వెంటనే వచ్చేలా చర్యలు తీసుకున్నామన్నా రు. ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్న తనను నేరుగా కలవవచ్చని ఎస్పీ బాధిత కుటుంబాలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి కె. శ్రీలక్ష్మి, ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, ఏఓ విజయకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆహార పారిశ్రామికాభివృద్ధి

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద సూక్ష్మ ఆహార పరిశ్రమలను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సబ్సిడీపై బ్యాంకుల ద్వారా రుణాలు కల్పించి వారికి అండగా నిలిచేందుకు రంగం సిద్ధం చేసింది. స్వయం సహాయక సంఘాల్లోని అక్క చెల్లెమ్మలకు చిన్న చిన్న ఆహార శుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న మహిళలకు చేయూతనిస్తున్నారు. మరింత మెరుగైన సదుపాయాల కల్పనకు, మౌలిక వసతులను మెరుగు పరుచుకుని ఆయా యూనిట్లను క్రమబద్ధీకరించే దిశగా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తోంది.



పేపర్ ప్లేట్లు తయారు చేయిస్తున్న సుభాషిణి



ఈమె పేరు బెల్లంకొండ సుభాషిణి. వెంకటాచలం మండలం ఇస్కపాళెం. ఈమె భర్త ఆటో నడుపుతుంటే కుటుంబానికి ఆసరాగా తనవంతుగా కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా పరిశ్రమలశాఖను సంప్రదించింది. పేపర్ ప్లేట్స్ యూనిట్ స్థాపించుకుంటామని చెప్పడంతో పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆమె దరఖాస్తు పరిశీలించిన అధికారులు రూ.20 లక్షల రుణం మంజూరు చేశారు. ఆమె పరిశ్రమ ఏర్పాటు చేసి మరో 15 మందికి ఉపాధి కల్పిస్తోంది. నెల్లూరులోని అన్ని క్యాటరింగ్‌లకు పేపర్ ప్లేట్స్‌ను విక్రయిస్తూ నెలకు సగటున రూ.75 వేలు సంపాదిస్తోంది.



ఈ యువకుడి పేరు కారంపూడి నరేష్. నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో నివాసం. కుటుంబ పోషణ కోసం చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాలనుకున్నాడు. వెంటనే పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా రుణ సహాయం కోరారు. పరిశీలించిన యంత్రాంగం రూ.15 లక్షలు మంజూరు చేసింది. ఇటీవలనే ఆ నగదుతో బిస్కెట్స్, టీకప్స్, కోన్స్ తయారు చేసే యంత్రాన్ని కొనుగోలు చేసి వ్యాపారం ప్రారంభించారు. టీ తాగి కప్‌ను ఐస్‌క్రీం కప్‌లా తినేయొచ్చు. నెల్లూరు పరిధిలో ఇలాంటి కప్‌లు కొత్తగా మార్కెట్‌లోకి రావడంతో ఆదరణ పెరిగింది. తన పరిశ్రమలో తనతో పాటు మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నాడు.

- సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలకు అండగా ప్రభుత్వం
- డ్వాక్రా సంఘాల్లోని మహిళా గ్రూపులకు ప్రాధాన్యం
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆర్థిక పరిపుష్టికి చర్యలు
- పీఎంఎఫ్ఎంఈ కింద పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం
- బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం
- 10 శాతం లబ్ధిదారు వాటా, 35 శాతం సబ్సిడీ
- గరిష్టంగా రూ.10 లక్షల రుణం, 3 శాతం వడ్డీ రాయితీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల జీవనోపాధులు మెరుగు పరచాలనే లక్ష్యంతో అనేక రంగాల్లో అనేక వర్గాలకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ముఖ్యంగా యువతతో పాటు పొదుపు గ్రూపుల్లోని మహిళలకు ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధానంగా మహిళలను పారిశ్రామికపరంగా ప్రోత్సహిస్తే ఆర్థికంగా పరిపుష్టి చెంది సమాజం బలంగా ఎదుగుతుందన్న సమున్నతాశయంతో డ్వాక్రా మహిళలకు తోడ్పాటు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రోత్సహించేందుకు పథక రచన చేశారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) ద్వారా ఆర్థిక తోడ్పాటుకు శ్రీకారం చుట్టారు.





**గరిష్టంగా రూ.10 లక్షల రాయితీతో రుణాలు**

జిల్లాలో 200 యూనిట్ల లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే 68 యూనిట్ల వరకు మంజూరయ్యాయి. అందులో కొన్ని పరిశ్రమలు గ్రౌండింగ్ పూర్తయ్యాయి. వ్యాపారాన్ని కూడా ప్రారంభించి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నాయి. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా లబ్ధి పొందే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 10 శాతం వాటాతో రుణ సదుపాయం దక్కనుంది. పథకం రుణ మొత్తంలో 35 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. సబ్సిడీలో కనిష్టంగా రూ.2 లక్షలు, గరిష్టంగా రూ.10 లక్షల రాయితీ అందించనున్నారు. రుణ మొత్తానికి 3 శాతం వడ్డీ రాయితీ కూడా కల్పించనున్నారు. ఇప్పటికే ఉన్న యూనిట్లకు సంబంధించి యంత్రాల ఏర్పాటుకు, కొత్త యూనిట్ ఏర్పాటుకు, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రుణ సౌకర్యం అందించనున్నారు. ప్రాజెక్ట్ వ్యయంలో 25 శాతం వర్కింగ్ క్యాపిటల్, 75 శాతం మెషినరీకి వెచ్చించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ నేతృత్వంలోని రీసోర్సు పర్సన్లు లబ్ధిదారులకు సహాయకారిగా నిలుస్తూ, వ్యవహారాలన్నీ చక్కబెట్టుతున్నారు. యూనిట్లు ఎంపిక, ఇతర మౌలిక వసతుల వివరాలు లబ్ధిదారుడికి అవగాహన కల్పించి, దరఖాస్తు దగ్గర నుంచి బ్యాంకు రుణం కల్పించే వరకు రీసోర్స్ పర్సన్లు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ ఆయా పరిశ్రమలకు సంబంధించి సిఫార్సు చేస్తోంది.

**పథకం లక్ష్యం**

ఆహారశుద్ధి రంగంలో ఉన్న అసంఘటిత యూనిట్లను సంఘటిత పరిచి క్రమబద్ధీకరించడం, ఔత్సాహికులకు రుణ సదుపాయం కల్పించడం, ఆహార ఉత్పత్తుల్లో నాణ్యం పెంచడమే ధ్యేయంగా పథకం రూపొందించారు. ఉత్పత్తుల మార్కెటింగ్ కల్పించడం తదితర విషయాలల్లో పథకం అమలు చేసేలా యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

**ఔత్సాహికులకు ప్రోత్సాహం**

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పరిధిలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం ఇస్తున్నాం. నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 200 యూనిట్లు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నాం. ఇప్పటికే 68 యూనిట్లు మంజూరయ్యాయి. అందులో కొన్ని యూనిట్లు బ్యాంకు సర్వీసులో ఉన్నాయి. ఔత్సాహికవేత్తలు ఇంకా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. నాణ్యమైన ఆహార ఉత్పత్తులు వినియోగదారుడికి అందించడం, తద్వారా పారిశ్రామికవేత్తలకు అండగా నిలవడమే ప్రధాన లక్ష్యమని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి శ్రీనివాసులు తెలిపారు.

– బి.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

# లోకేష్ పాదయాత్ర బఫూన్ యాత్ర



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- పాదయాత్ర చేస్తే లోకేష్ సీఎం కాలేడు
- మధ్యలో ఆపేసి వెళ్లిపోతాడు
- రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే శాశ్వత సీఎం
- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: లోకేష్ పాదయాత్ర బఫూన్ యాత్ర, దండగ యాత్రగా చరిత్రలో మిగిలిపోతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. పాదయాత్ర చేసి అర్జెంట్‌గా సీఎం అయిపోతానని లోకేష్ కలలు కంటున్నాడని ఎద్దేవా చేశారు. మండలంలోని పడుగుపాడు చంద్రమౌళినగర్ కాలనీలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని చూసి చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్‌కు నిద్రపట్టడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి మేలు చేయాలన్న లక్ష్యం, సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇంత మంచి చేసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో గతంలో ఎవరూ లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఏ సర్వేలు చూసినా దేశ స్థాయిలో బెస్ట్ సీఎంల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి మూడు స్థానాల్లోనే ఉన్నారన్నారు. ఇక పూర్తిగా రాజకీయ సమాధి ఖాయమని అర్థమైన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్‌కు జగన్ పాలన చూసి ఓర్చుకోలేకపోతున్నారన్నారు. అనునిత్యం పచ్చి అబద్ధాలను చెబుతూ మా ప్రభుత్వాన్నే దూషించడం పనిగా పెట్టుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. లోకేష్ ఈ నెల 27 నుంచి పాదయాత్ర చేసేందుకు సిద్ధమవుతున్నారని, ఆయన పాదయాత్ర వల్ల ఉపయోగం లేదన్నారు. ప్రజలను ఆకర్షించే విధంగా ఆయన భాష లేదన్నారు. పాదయాత్ర ప్రారంభించిన రెండు.. మూడు రోజుల్లోనే పేలవంగా మారడం, ఆయన మధ్యలోనే ఆపేసి ప్యాకప్ చెప్పి ఇంటికి వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. పాదయాత్రలు చేస్తే సీఎంలు కాలేరని, ప్రజాదరణతో పాటు నాయకత్వ పటిమపై ప్రజలకు నమ్మకం ఉండాలన్నారు. ఆయన తండ్రి చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి ఈ రాష్ట్రంలో ప్రజలకు ఏ విధమైన మేలు చేకూరిందో ఒక్కటంటే ఒక్కటి చెప్పగలడా ప్రశ్నించారు. తండ్రి సీఎంగా ఉన్నప్పుడు లోకేష్ మంత్రిగా చేసిన ఒక గొప్ప కార్యక్రమం చెప్పగలడా అని ఎద్దేవా చేశారు. లోకేష్ పాదయాత్ర, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర, చంద్రబాబు పాకుడు యాత్ర చేపట్టినా ఎటువంటి ఉపయోగం లేదన్నారు. చంద్రబాబు హయాంలో ఏ ఒక్కరికీ న్యాయం చేయకపోగా, అక్రమ, అన్యాయం పాలన సాగిందన్నారు. మా పరిపాలనలో గుండెల మీద చేయి వేసుకుని ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లి మన ముఖ్యమంత్రి మీ కుటుంబానికి ఇంత లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని చెబుతున్నామన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. చంద్రబాబు జీవితం కుట్రలు కుతంత్రాలతో సాగిందన్నారు. రెండెకరాల ఆసామికి ఇన్ని రూ.లక్షల కోట్లు ఎలా వచ్చాయో లోకేష్ పాదయాత్రలో ప్రజలకు జవాబు ఇచ్చి, తండ్రీ, కొడుకు, దత్తపుత్రుడు పాలనలో ప్రజలకు చేసిన అన్యాయంపై క్షమాపణలు చెప్పి ప్రాయచిత్తం చేసుకోవాలని సూచించారు. పడుగుపాడు సచివాలయం పరిధిలో ఎఫ్‌డీఆర్ నిధులతో రూ.1.90 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశామన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.13.72 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీపీ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ ఎస్‌కే అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడెందుకు గళం విప్పలేదు



పాటూరువారికండ్రిగలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- నోరు తెరిస్తే అపస్వరాలు, అపశ్రుతులే
- పాదయాత్ర చేస్తే సీఎం అవుతుడా?
- లోకేష్ యువగళంపై మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా

ముత్తుకూరు: తండ్రి ముఖ్యమంత్రిగా ఉండగా అడ్డదారిలో ప్రధానమైన శాఖలకు మంత్రి అయిన లోకేష్.. యువకులకు మేలు స్థాయిలో ఉండి ఆ రోజు ఎందుకు గళం విప్పలేదని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆయన పాదయాత్ర చేసుకుంటే ఏం ఒరిగేది లేదన్నారు. పాదయాత్రకు ప్రజాస్పందన లేకపోవడంతో ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వలేదంటూ ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. పాటూరువారికండ్రిగ, ముత్తుకూరు పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరుస్తున్నామని చెప్పుకుంటూ ప్రజల్లో తిరుగుతున్నామంటే మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన పరిపాలన, ప్రజలకు చాలా చేరువగా ఉండే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను, పవన్‌కళ్యాణ్‌ను తాము పదే పదే అడిగేది ఒక్కటే అన్నారు. మీరు అధికారంలో ఉండగా ఈ రోజు అమలవుతున్న పథకాలను ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ పథకాలతో రాష్ట్రం అప్పుల పాలైపోతుందని ఒక్కసారి, మరోసారి తాము అధికారంలోకి వస్తే ఇంతకంటే మరిన్ని పథకాలు ఇస్తామని చెప్పడం చూస్తే.. చెప్పకనే ఈ పథకాలన్ని రద్దు చేస్తామని చెబుతున్నట్లుగా ఉందన్నారు. అధికారంలో ఉండగా లోకేష్ యువకుల కోసం చేసింది ఏమీ లేదని, ఇప్పుడు యువగళం పేరుతో ముందుకు వస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు వయసు పైబడిందని, జ్ఞాపకశక్తి పూర్తిగా నశించిందన్నారు. మైక్ పట్టుకుని మాట్లాడే స్థితిలో లేక మెడకు మైక్ తగిలించుకుని మాట్లాడుతున్న చంద్రబాబు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఏం చేస్తాడన్నారు. రాబోయే ఎన్నికలే తనకు చివరి ఎన్నికలంటూ అంగీకరించాడన్నారు. చంద్రబాబు పాదయాత్ర చేయలేక.. కొడుకును వారసుడిగా ప్రకటించుకునేందుకు చేస్తున్న ప్రయత్నమన్నారు. యువగళం వినిపిస్తానంటున్న లోకేష్ నోరు తెరిస్తే అపస్వరాలు, అపశృతులు తప్ప పాదయాత్ర చేసినంత మాత్రాన ఒరిగేది ఏమీలేదన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేసి సీఎం అయ్యారని, చంద్రబాబు దొంగయాత్ర చేసి సీఎం అయ్యారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసి సీఎం అయ్యారని తాను కూడా పాదయాత్ర చేసి సీఎం అవుతానని ఊహల్లో ఉన్నాడన్నారు. ఈయన పాదయాత్రకు జనాన్ని ఎలా తరలించాలా అని నాయకులు ఆలోచనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సకల అవ లక్షణాలు కలిగిన లోకేష్‌ని తన వారసుడిగా ప్రకటించడం టీడీపీ దౌర్భాగ్యమన్నారు. టీడీపీకి భవిష్యత్ లేదని జోస్యం చెప్పారు. చంద్రబాబు ఇక ముఖ్యమంత్రి కాలేరని అన్నారు. ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకొంటున్నారన్నారు..

**ప్రజలకు చాలా చేరువ అయ్యాం**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు చాలా చేరువయ్యే అవకాశం లభించిందని మంత్రి కాకాణి అన్నారు. ఈ మహత్తర అవకాశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కల్పించారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమవుతున్నందుకు సంతృప్తిగా ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 50 శాతం పూర్తి చేశామన్నారు. పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, సర్పంచ్ మాచిరెడ్డి రాజారామిరెడ్డి, మాచిరెడ్డి శేఖర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, కొండారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు షేక్ నవీద్ బాషా, నాయకులు కే లక్ష్మణరెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్ధనరెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పూర్తిస్థాయి సహకారం అందించడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో పరిశ్రమలు, ఎగుమతులు, సహకారం అనే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే వారికి సకాలంలో అనుమతులన్ని మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ కింద మంజూరైన చిన్న పరిశ్రమలను నిర్దేశించిన గడువులోగా గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేస్తే జిల్లాలో వేలాది మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా పారిశ్రామిక శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లాంటివి వేగవంతంగా కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచే అందే రాయితీలను సకాలంలో అందించాలన్నారు. పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగులు స్థానికులకే దక్కేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1,041 దరఖాస్తులు రాగా 999 దరఖాస్తులను అనుమతించామన్నారు. 22 దరఖాస్తులను తిరస్కరించామని మరో 20 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీపీ పథకం ద్వారా 278 యూనిట్లను జిల్లాకు మంజూరు చేయగా వాటిలో 217 గ్రౌండింగ్ చేశామని వివరించారు. ఈ సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, పరిశ్రమల కేంద్రం జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం చంద్రశేఖర్, డీపీఓ చిరంజీవి, ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, విద్యుత్, ఇరిగేషన్‌శాఖల ఇఇలు వెంకటసుబ్బయ్య, కృష్ణమోహన్, లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ తదితర పలువురు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

# విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలి


అండర్‌-17 బాలుర విభాగంలో విజేతగా నిలిచిన నెల్లూరు జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


అండర్‌-14 బాలికల విభాగంలో విజేతగా నిలిచిన అనంతపురం జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్‌ పోటీలు

**ఆత్మకూరు:** 'విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలి. పుట్టిన ఊరు, తల్లిదండ్రులు గర్వపడేలా క్రీడల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలి.' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయి అండర్‌-14, 17 నెట్‌బాల్‌ పోటీలు మూడురోజులుగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం ఫైనల్స్‌ జరిగాయి. ముగింపు కార్యక్రమానికి విక్రమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ ఉంటుందన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సోదరుడు దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి క్రీడాకారులకు ఎంతో సహకారం అందించారన్నారు. తాను అదే కోవలో పయనిస్తానన్నారు. రానున్న రోజుల్లో జరిగే నెట్‌బాల్‌ పోటీల్లో క్రీడాకారులకు షూతోపాటు దుస్తులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జి.వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ షేక్‌ సర్దార్‌, కమిషనర్‌ ఎం.రమేష్‌బాబు, గుంటూరు ఆర్‌ఐపీ మహబూబ్‌బాషా, శాప్‌ డైరెక్టర్‌ కాలువ నరసింహులు, స్కూల్‌ గేమ్స్‌ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, నాయకులు కొండా వెంకటేశ్వర్లు, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్‌ సూరా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విజేతల వివరాలు**

అండర్‌-14 బాలికల విభాగంలో వైఎస్సార్‌ జిల్లా జట్టు ప్రథమ స్థానం, అనంతపురం, ప్రకాశం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు, బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లా జట్టు ప్రథమ స్థానం, వైఎస్సార్‌, అనంతపురం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. అదే విధంగా అండర్‌-17 బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు ప్రథమ స్థానం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవశం చేసుకోగా, వెస్ట్‌ గోదావరి, వైఎస్సార్‌ జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయని నిర్వాహకుడు పీఈటీ తిరుపతయ్య తెలిపారు.

# దృష్టి మళ్లించి.. దర్జాగా చోరీ

- రూ.40 వేల విలువైన దుస్తుల అపహరణ

**ఆత్మకూరు:** కొందరు వ్యక్తులు పట్టణంలోని ఓ వస్త్ర దుకాణానికి వెళ్లారు. అక్కడి వారిని ఏమార్చి రూ.40 వేలకుపైగా విలువైన వస్త్రాలను చోరీ చేశారు. ఈ ఘటన ఆత్మకూరు పట్టణంలో ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పాత సినిమాహాల్‌ సెంటర్‌లో పరిటాల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. భోగి పండగ రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో కారులో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు దుకాణానికి వచ్చారు. దుస్తులు కొనుగోలు చేసేలా అతడితో మాట్లాడారు. ఈక్రమంలో ఓ మహిళ దుకాణం వెలుపల అరుగుపై ఉన్న లుంగీల బండిల్‌ను కారులో పెట్టింది. దుకాణాదారుడితో మాట్లాడుతున్న వారు ఏమి కొనుగోలు చేయకుండానే వెళ్లిపోయారు. దుకాణం మూసే సమయంలో వెంకటేశ్వర్లు పరిశీలించగా లుంగీల బండిల్‌ కనిపించకపోవడంతో పనిచేసే వ్యక్తులను, సమీపంలో ఉన్న వారిని విచారించినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టారు. సోమవారం ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఓ మహిళ బండిల్‌ను కారులో పెడుతున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

## నేడు నెల్లూరులో జాబ్‌మేళా

**నెల్లూరు(మినీబైపాస్‌):** నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎ.సురేష్‌కుమార్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్‌ ఫైనాన్స్‌ లిమిటెడ్‌, క్వెస్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌, మెడ్‌ప్లస్‌, యురేకా ఫోర్బ్స్‌ కంపెనీల్లో మార్కెటింగ్‌, రికవరీ ఎగ్జిక్యూటివ్స్‌, టెలీకాలర్స్‌, బ్రాంచ్‌ రిలేషన్‌షిప్‌ ఎగ్జిక్యూటివ్‌ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌, డిగ్రీ, ఐటీఐ, బీఎండీ ఫార్మసీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు.

## బ్లూ కోల్ట్స్‌పై రౌడీషీటర్‌ దౌర్జన్యం

**నెల్లూరు(క్రైమ్‌):** బ్లూ కోల్ట్స్‌పై రౌడీషీటర్‌ దౌర్జన్యం చేసిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్స్‌ డి.హరీష్‌, పి.మల్లికార్జున బ్లూ కోల్ట్స్‌ విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 22వ తేదీన ఆదివారం వారు నెక్లెస్‌రోడ్డులో విధులు నిర్వహించసాగారు. రోడ్డు చివర రౌడీషీటర్‌ బాబు మద్యం తాగుతుండడాన్ని వారు గుర్తించారు. అక్కడికి వెళ్లి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగకూడదని చెప్పారు. మద్యం మత్తులో ఉన్న రౌడీషీటర్‌ వారిపై దౌర్జన్యం చేసి పరిగెత్తే క్రమంలో కిందపడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలిస్తుండగా బ్లూ కోల్ట్స్‌ను తోసేసి పరారయ్యాడు. సిబ్బంది జరిగిన విషయాన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ సీతారామయ్య దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు బాబుపై కేసు నమోదు చేశారు. నిందితుడిపై చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్‌ ఉంది.

# గ్రౌండ్‌కు వెళ్లండి.. ఫిట్‌గా ఉండండి

- ఎస్పీ సీహెచ్‌ విజయారావు


విజేత జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేసిన ఎస్పీ విజయారావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

**కావలి:** 'మీకు సమీపంలో ఉండే గ్రౌండ్‌కు వెళ్లి ఆటలాడండి. దీంతో ఎంతో ఫిట్‌గా ఉంటారు.' అని ఎస్పీ సీహెచ్‌ విజయారావు యువతకు పిలుపునిచ్చారు. కావలిలోని జెడ్పీ హైస్కూల్‌ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వైఎస్‌ జగనన్న క్రికెట్‌ టోర్నమెంట్‌ సీజన్‌-2 ఫైనల్స్‌ విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఎస్పీ విచ్చేసి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు, యువత ఎక్కువ సమయాన్ని మొబైల్‌ఫోన్లకే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలపై శ్రద్ధ చూపి, గ్రౌండ్‌కు వెళ్లేవారు బాగా తగ్గిపోయారన్నారు. మానసికోల్లాసం కోసం క్రీడల్లో పాల్గొనడమే ఉత్తమ మార్గమని చెప్పారు. పాల్గొన్న ప్రతి జట్టుకు కిట్లు, జ్ఞాపికలు అందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

**ఆసక్తి పెరగాలని..**

ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలోని యువకుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెరగాలనే ఆకాంక్షతోనే ఎంతో కష్టపడి క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహించామన్నారు. ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల దేవధీరజ్‌రెడ్డి ఈ టోర్నమెంట్‌ విజయవంతానికి కృషి చేశారని కొనియాడారు.

**బహుమతుల అందజేత**

ఎస్పీ విజయారావు, ఎమ్మెల్యే రామిరెడ్డి కాసేపు బ్యాటింగ్‌ చేసి క్రీడాకారులు ఉత్సాహపరిచారు. కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, నిర్వాహకులు చంద్రశేఖర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి వారికి బౌలింగ్‌ చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గత నెల 21వ తేదీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి సహకారంతో ప్రారంభమైన టోర్నమెంట్‌లో 80 జట్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన కావలి పట్టణానికి చెందిన లెవన్‌ బుల్స్‌ జట్టుకు రూ.లక్ష నగదు, ట్రోఫీని అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన సింగపేట-వెలిచర్ల (ఎస్‌వీ) జట్టుకు రూ.50,000 నగదు ఇచ్చారు. ఫైనల్‌ మ్యాచ్‌లో లెవన్‌ బుల్స్‌ జట్టుకు చెందిన క్రీడాకారుడు కిశోర్‌ మ్యాన్‌ ఆఫ్‌ ది మ్యాచ్‌, మ్యాన్‌ ఆఫ్‌ ది సీరీస్‌, బెస్ట్‌ బౌలర్‌గా ఎంపికవగా నగదు బహుమతి అందజేశారు. బెస్ట్‌ బ్యాట్స్‌మన్‌గా నవీన్‌, బెస్ట్‌ ఫీల్డర్‌గా ఎస్‌వీ లెవెన్‌ జట్టుకు చెందిన హరిమనోహర్‌ ఎంపికయ్యారు. కాగా టోర్నమెంట్‌లో మూడో స్థానంలో నిలిచిన శ్రీరాంపురం జట్టుకు రూ.25,000 నగదు బహుమతి ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాటా శ్రీనివాసులురెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, పందిటి కామరాజు, గుర్రం వెంకటేశ్వర్లు, మండలి కృష్ణారావు, తిరువీధి ప్రసాద్‌, అమరా వేదగిరి, షేక్‌ షాహుల్‌ హమీద్‌, కనుపర్తి రాజశేఖర్‌, ఓఎన్‌జీసీ కృష్ణారెడ్డి, దామిశెట్టి సుధీర్‌ నాయుడు, కందుల శ్రీనివాసులు, సైకిలాబ్‌ తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్‌ చేస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే

# వ్యక్తి ఆత్మహత్యాయత్నం


మహబూబ్‌బాషాతో మాట్లాడుతున్న పోలీస్‌

**మర్రిపాడు:** మండల కేంద్రమైన మర్రిపాడులోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ఓ వ్యక్తి సోమవారం డీజిల్‌ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా అనే రైతు తన పొలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, రికార్డులను తారుమారు చేసి రిజిస్ట్రేషన్‌ చేయించారని ఆరోపిస్తున్నాడు. ఆ పొలంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నారని అతను చెబుతున్నాడు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో మహబూబ్‌బాషా తహసీల్దార్‌ కార్యాలయం వద్దకు చేరుకుని ఒంటిపై డీజిల్‌ పోసుకుని నిప్పంటించుకునేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మహబూబ్‌బాషాకు కౌన్సెలింగ్‌ ఇచ్చారు. తహసీల్దార్‌ హేమంత్‌కుమార్‌ స్పందిస్తూ ఈ విషయం ఆర్డీఓ పరిధిలో ఉందన్నారు. కార్యాలయంలో పూర్తిస్థాయిలో రికార్డు లేకపోవడంతో విచారణ ఆలస్యమవుతోందని, మహబూబ్‌బాషాకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

| నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు | | | | నిమ్మధరలు (కిలో) | |
|---|---|---|---|---|---|
| బ్రాయిలర్‌ (లైవ్‌) | 114 | బ్రాయిలర్‌ చికెన్‌ | 200 | పెద్దవి | రూ.25 |
| లేయర్‌ (లైవ్‌) | 95 | బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌ | 224 | సన్నవి | రూ.12 |
| | | లేయర్‌ చికెన్‌ | 162 | పండ్లు | రూ.5 |

సాక్షి Smart Economic Display Advertisement Feature




# జంతు హింస నివారణకు కృషి

- కలెక్టర్‌ చక్రధర్‌బాబు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్‌ తదితరులు

**నెల్లూరు(అర్బన్‌):** జంతు హింసను నివారించి, వాటి సంక్షేమానికి కృషి చేయాలని కలెక్టర్‌ కేవీఎస్‌ చక్రధర్‌బాబు ఆదేశించారు. నెల్లూరులోని క్యాంప్‌ కార్యాలయంలో జంతు హింస నివారణ సంస్థ కార్యనిర్వాహక కమిటీ సభ్యులతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. జంతువుల సంక్షేమం సామాజిక బాధ్యతన్నారు. జంతు హింసను నివారించేందుకు ప్రభుత్వం 1960లోనే చట్టం చేసిందన్నారు. ఈ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నగరంలో ఆవులు రోడ్లపై తిరుగుతుండడంతో ట్రాఫిక్‌ అంతరాయం కలుగుతున్నందున వాటిని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. పాఠశాలల్లో జంతు సంక్షేమంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. వీధి కుక్కలకు రేబిస్‌ వ్యాక్సిన్‌ వేయించాలన్నారు. పశువైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా జంతు సంక్షేమంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను, కరపత్రాలను కలెక్టర్‌ ఆవిష్కరించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్‌ హరిత, పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, ఉప వాణిజ్య అధికారి వరప్రసాద్‌, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్‌ దేవరాజ్‌, దిశ పోలీస్‌ స్టేషన్‌ సీఐ రామారావు, ఆర్డీఓ సుధాకర్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్‌ వెంకటరమణ, సామాజిక కార్యకర్తలు ఉమాదేవి, జయప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యం కుదుటపడలేదని..

- ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


విజయ్‌ మృతదేహం

**నెల్లూరు(క్రైమ్‌):** తీవ్ర అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్‌ మండలం అల్లీపురానికి చెందిన శ్రీపతి విజయ్‌ (48), వినీల దంపతులకు పవిత్ర, స్రవంతి, భాను అనే పిల్లలున్నారు. విజయ్‌ కారు డ్రైవర్‌. 2017లో ప్రమాదం జరిగి కాలు విరిగింది. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. విజయ్‌ కొద్దినెలలుగా టీబీ, షుగర్‌తో పాటు పలు వ్యాధులతో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఈనెల 21వ తేదీన విజయ్‌ తన కుమారుడితో కలిసి నగరంలోని ఓ ప్రైవేట్‌ హాస్పిటల్‌కు వెళ్లి వైద్యులకు చూపించుకుని తిరిగి ఇంటికెళ్లారు. అదేరోజు సాయంత్రం విజయ్‌ కుటుంబసభ్యులకు చెప్పకుండా నెల్లూరుకు వచ్చాడు. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడటం లేదని మనస్తాపానికి గురైన ఆయన రైల్వేస్టేషన్‌ తూర్పువైపు కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే సమయంలో కొడుకు ఫోన్‌ చేయడంతో ఈ విషయాన్ని చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు, పక్కింట్లో ఉండే ధనశేఖర్‌తో కలిసి రైల్వేస్టేషన్‌ వద్దకు చేరుకుంది. అపస్మారకస్థితిలో ఉన్న విజయ్‌ను జయభారత్‌ హాస్పిటల్లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వినీల నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.తిరుపతయ్య హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పురుగుమందు తాగిన బాలిక

**గుడ్లూరు:** పురుగుమందు తాగి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని ఏలూరుపాడులో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రామస్వామిగౌడ కుమార్తె అనూష చేవూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన అనూష ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుమందు తాగింది. పొలానికి వెళ్లి రాత్రి ఇంటికి తిరిగొచ్చిన తల్లిదండ్రులకు కూతురి పరిస్థితిని చూశారు. పక్కనే పురుగుమందు డబ్బా చూసి ఆందోళన చెంది కావలిలోని వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

यूनियन बैंक Union Bank of India
యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా
బుచ్చిరెడ్డిపాలెం బ్రాంచ్‌-2
గుడి వీధి, బుచ్చిరెడ్డిపాలెం, ఎస్‌పీఎస్‌ఆర్‌ నెల్లూరు-524305
ఫోన్‌ నెం.0861-273432, ఇ.మెయిల్‌: Ubin0800546@Unionbankofindia.Bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌ 2002లోని రూల్‌ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్‌ & రీకన్‌స్ట్రక్షన్‌ ఆఫ్‌ ఫైనాన్షియల్‌ అసెట్స్‌ & ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఆఫ్‌ సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ యాక్ట్‌, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు

ఇందుమూలముగా నోటీసు జారీచేస్తూ సాధారణ ప్రజానీకానికి మరియు "ఋణగ్రహీత(లు) & హామీదారు(లు)"లకు ప్రత్యేకంగా తెలుపునది ఏమనగా, సెక్యూర్డు క్రెడిటర్‌ తనఖాలో / ఛార్జీలో ఉన్న దిగువ తెలిపిన స్థిరాస్తులు యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా, బుచ్చిరెడ్డిపాలెం బ్రాంచ్‌-2 (సెక్యూర్డ్‌ క్రెడిటర్‌) అధీకృత అధికారిచే దిగువ ఋణగ్రహీతలు & హామీదారుల నుండి భౌతికంగా స్వాధీనం తీసుకొనబడినవి, వాటిని సెక్యూర్డు క్రెడిటర్‌ "ఎక్కడ ఉన్నది అలాగే" "ఏది ఉంటే అది & అక్కడ ఏది ఉన్నా అలాగే" పద్ధతిలో తేది.23.02.2023 న యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా, బుచ్చిరెడ్డిపాలెం బ్రాంచ్‌-2 కి చెల్లించవలసిన బకాయి సొమ్ము తేది:31.12.2022 నాటికి రూ. 18,62,113.22 పై + వడ్డీ & ఇతర ఖర్చులతో సహా సదరు మొత్తం

ఋణగ్రహీత: మెస్సర్స్‌ శ్రీ కాత్యాయని ఫిల్లింగ్‌ స్టేషన్‌, ప్రొప్రైటర్‌: సిహెచ్‌ మమత, భర్త: శ్రీనివాసులు రెడ్డి, సంగం, ఎస్‌పిఎస్‌ఆర్‌ నెల్లూరు-524308. సహ-హామీదారు/తనఖాదారు: శ్రీమతి సూరా కృష్ణవేణి, భర్త: వెంకట ప్రసాద్‌ రెడ్డి, డి.నెం.బి-11-58 ఎదురుగా, బ్లాక్‌ నెం.11, వార్డు నెం.6, విద్యా సదనం వీధి, పవ్వేరు మజరా, బుచ్చిరెడ్డిపాలెం, ఎస్‌పిఎస్‌ఆర్‌ నెల్లూరు-524305. వార్ల నుండి రాబట్టుకొనుటకు ఈ-వేలం ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు.

వేలం తేది మరియు సమయం : 23-02-2023, ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥1.00 వరకు
ధరావత్తు సమర్పించుటకు చివరి తేది : 22.02.2023 న సా.4.00 గం.ల లోపుగా

| స్థిరాస్తుల యొక్క సంక్షిప్త వివరములు | రిజర్వు ధర (లక్షలలో) | ధరావత్తు (రిజర్వు ధరలో 10%) |
|---|---|---|
| ఎస్‌పిఎస్‌ఆర్‌ నెల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, పవ్వేరు మజరా, విద్యా సదనం వీధి, వార్డు నెం.6, బ్లాక్‌ నెం.11, డి.నెం.బి-11-58 ఎదురుగా, సర్వే నెం.223/బి వద్ద 19 అంకణములు 6 చ॥గ॥లు లేదా 152.66 చ॥గ॥ల విస్తీర్ణం గల భూమి యావత్తు ఆస్తి శ్రీమతి సూరా కృష్ణవేణి గారికి చెందినది. హద్దులు: తూర్పు: బరిగెల కామయ్య మరియు ఇతరులకు చెందిన స్థలం, దక్షిణం: పిడబ్ల్యుడి కెనాల్‌, పడమర: 13'-0" వెడల్పు రాజా వీధి, ఉత్తరం: నలుబోలు రాధాకృష్ణ రెడ్డి గారికి అమ్మబడిన స్థలం. | రూ. 26,00,000/- (అక్షరాలా ఇరవై ఆరు లక్షల రూపాయలు మాత్రమే) | రూ. 2,60,000/- (అక్షరాలా రెండు లక్షల అరవై వేల రూపాయలు మాత్రమే) |

1. నమోదు సంబంధిత సందేహముల కొరకు ఇ-మెయిల్‌: ibapiop@mstcecommerce.com చేయండి.
2. ధరావత్తు చెల్లింపు / వాపసు సందేహముల కొరకు ఇ-మెయిల్‌: ibapifin@mstcecommerce.com చేయండి.
3. నమోదు మరియు లాగిన్‌ అగుటకు మరియు బిడ్డింగ్‌ నిబంధనల కొరకు https://www.mstcecommerce.com/auctionhome/ibapi/index.jsp నందలి "బయ్యర్‌ గైడ్‌ ఫర్‌ లాగిన్‌ అండ్‌ రిజిస్ట్రేషన్‌" ను క్లిక్‌ చేయండి.
4. ఉద్దేశించిన బిడ్డర్లు "అమ్మకం ప్రకటన కాపీలు ఇ-వేలం నియమ నిబంధనలు మరియు ఇ-వేలం నందు పాల్గొనుటకు సహాయకారి పత్రములు, e-Bkray - IBAPI వారి పోర్టల్‌ నుండి ఉచితముగా డౌన్‌లోడ్‌ చేసికొనవచ్చును (https://www.ibapi.in)
5. వేలం సంబంధిత సందేహముల కొరకు ఇ-మెయిల్‌ "sarfaesi@unionbankofindia.com" లేదా శ్రీ డి రమేష్‌ బాబు, సీనియర్‌ బ్రాంచ్‌ మేనేజర్‌ & బ్రాంచ్‌ హెడ్‌, బుచ్చిరెడ్డిపాలెం బ్రాంచ్‌-2, సంప్రదించవలసిన సెల్‌ నెం.9441782215. ఇ-మెయిల్‌: UBIN0800546@unionbankofindia.bank.
6. మీ మొబైల్‌ నెంబరు మరియు ఇ-మెయిల్‌ ఐడి ఉపయోగించి మా ఇ-వేలం పోర్టల్‌ www.mstcecommerce.com నందు నమోదు చేసుకొనవలెను. సంబంధిత కెవైసి (KYC) పత్రములు అప్‌లోడ్‌ చేయండి.
7. చలాను పొందండి మరియు బిడ్డరు యొక్క గ్లోబల్‌ ఇఎమ్‌డి వాలెట్‌కు ధరావత్తు మొత్తము బదిలీ చేయండి.
8. బిడ్‌లు వేలం తేది మరియు సమయం నందు ఆన్‌లైన్‌ ద్వారా మాత్రమే సమర్పించవలెను.
9. ఒకవేళ విజేత అయిన బిడ్డరు మిగులు బిడ్‌ మొత్తము ఈ దిగువ తెలిపిన తేది మరియు సమయముల నందు నియమముల ప్రకారం చెల్లించవలెను.
10. ఒక వేళ మీ బిడ్‌ అంగీకారము పొంద లేక పోయిన ఎడల MSTC యొక్క వెబ్‌సైట్‌ నందు మీ వాపసు అభ్యర్థన చేయండి మరియు MSTC ద్వారా మీకు నేరుగా వాపసు చేయబడును.
11. ఇ-వేలం పూర్తి నియమముల మరియు అమ్మకం నిబంధనలకు మీ బిడ్స్‌ సమర్పించుటకు ముందుగా మరియు ఇ-వేలం అమ్మకం విధానములో పాల్గొనుటకు బిడ్డర్లు మా వెబ్‌సైట్‌ https://www.ibapi.in and www.unionbankofindia.co.in దర్శించవలసినదిగా సలహా ఇవ్వబడినది.
12. ఉద్దేశించిన బిడ్డరు వారి కోరిన ఎడల అధీకృత అధికారి యొక్క ముందస్తు అనుమతులు పొంది ఇ-వేలం తేది ముందుగా అమ్మకం జరుపబడు స్థిర / చర సెక్యూర్డు ఆస్తులను తనిఖీ చేసికొనవచ్చును. బిడ్డర్లు తమ బిడ్లు సమర్పించుటకు ముందుగానే ఈ సెక్యూర్డు ఆస్తులను తనిఖీ చేసుకొని ఆస్తుల వివరములు మరియు నాణ్యతపై తమంతటతామే సంతృప్తి చెందవలసిన పూర్తి బాధ్యతలను కలిగి ఉండవలెను.

ఈ ప్రకటన పై లోనుకు సంబంధించిన ఋణగ్రహీత(ల)కు, హామీదారు(ల)కు సెక్యూరిటీ ఇంటరెస్ట్‌ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌) రూల్స్‌, 2002లోని రూల్‌ 8(6) రూల్‌ 9(1)ల క్రింద పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం జరుపబడునని తెలియజేస్తూ ఇచ్చిన ప్రకటనగా కూడా పరిగణించవలెను.

ప్రదేశం: బుచ్చిరెడ్డిపాలెం
తేది: 16.01.2023
సం/- చీఫ్‌ మేనేజర్‌ & అధీకృత అధికారి, యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా, బుచ్చిరెడ్డిపాలెం బ్రాంచ్‌-2

సాక్షి క్లాసిఫైడ్స్‌

EDUCATION

DIRECT FINAL YEAR
■Last Chance:10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629 [T-1925]

SPOKEN ENGLISH
■ఇంగ్లీష్‌లో మాట్లాడితే గౌరవము, ఆత్మవిశ్వాసం, నమ్మకము, అవకాశాలు మరియు ఉద్యోగం ఉంటాయి. కాబట్టి ఇంగ్లీష్‌ని సులభంగా నేర్చుకుందాం రండి. ఆన్‌లైన్‌ క్లాసులు బోధించబడును. 9963951240. [NA-21639]

REAL ESTATE

PLOT FOR SALE
■అన్ని వసతులతో దొడ్లవైరీ జొన్నవాడ ఆర్చి దగ్గరలో మెయిన్‌ రోడ్‌ నందు 25 అం॥ల DTCP ప్లాటు 9,50,000లకే. నో మీడియేషన్‌. వివరాలకు సంప్రదించండి. సెల్‌: 63031 89893 [NA-11355]
■నెల్లూరు, ధనలక్ష్మీపురం, కాకుపల్లిలో 20,25,30 అం॥ల నుడా అప్రూవ్డ్‌ ప్లాట్లు అం॥78 వేల నుండి 1 లక్ష 85 వేలు. బ్యాంక్‌ లోను కలదు. (40,50,60 ఫీట్‌ సిమెంట్‌రోడ్‌) నో బ్రోకర్స్‌. 9966731116. [NA-10421]
■నెల్లూరు కార్పొరేషన్‌ నరుకూరు సెంటర్‌ ప్రక్కన, DTCP లే అవుట్‌లో 19 అంకణాల తూర్పు ఫ్లాట్‌ అమ్మకానికి కలదు. అంకణం 60,000/- వేలు. వివరాలకు సంప్రదించండి. 93812 43199. [N-787834]

SERVICES

BUSINESS OFFER
■మంచి ఆదాయంతో పాటుగా గుర్తింపు, గౌరవము మరియు Work Satisfaction కోసం వెతుకుతున్న ఉత్సాహవంతులకి ఒక చక్కని అవకాశం. సంప్ర: 9032707715. [T-1934]

GOLD FINANCE
■బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్‌ క్యాష్‌. సంప్ర: ✆ 96590 57777 [B-808]
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌ క్యాష్‌) 100% జెన్యూన్‌. ✆ 76508 91999 [B-786665]
■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌ క్యాష్‌) (100% జెన్యూన్‌) ✆ 90009 92521 [B-2284]

SECOND SALES
■A to Z సెకండ్‌ హ్యాండ్‌ వస్తువులు మరియు గృహోపకరణాలు కొనబడును మరియు అమ్మబడును. వివరములకు సంప్రదించండి: 8019193030, 96183 10239. [NA-21622]

WANTED
■Wanted System Male or Female Operators Qlf: Degree Freshers, Time: 9:30am to 6.00pm. Location: Nellore Town Only. Contact: 72888 03402, 90307 43622. [NA-5280]

CHANGE OF NAME
I, KOPPOLU SUHAS CHAITANYA, S/o Sudhakara Babu Koppolu. Residing at D.No,16-4-38, Venkateswara Nagar, Near Gundamma Katta, kandukuru, Prakasam Dt, AP. I Further Submit my Father Actual name is KOPPOLU SUDHAKARA BABU as per my Aadhar card, But in my SSC Marks Memo My Father name was Mentioned as SUDHAKAR BABU, I Futher Submit that the Both Names are One and same Person.

■Job vacancy Computer Knowledge admin & sales stores dept (Female / Male) Contact: 97040 10217. [N-787832]
■Good job opportunity. company Name: TRANZ MART, Q:10th to Any Degree / Diploma/ITI. (M/FM), Age Limit :18 to 28, Income:13000 to 19000, Location @ Nellore, Room + Food FREE. Cont: 9398150197 [A-278]
■Wanted Tele Callers (M/F) with computer knowledge. Qlf: Any Degree, Language: Telugu, Kannada, Tamil, Malayalam, Sal: 8,500 to 15,000, Near BV Nagar, Nellore. 9884777075, 8248588046. [NA-21625]
■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-779856]
■Govt.ఆమోదించిన MNC కంపెనీలో P/F టైమ్‌ వర్క్‌ చేయుటకు యువతి, యువకులు 60 మంది కావలెను. గృహిణులు కూడా అర్హులే. P/T: 10K, F/T:20K ఆదాయం. వర్క్‌ఫ్రమ్‌హోం. 9392343484. [N-787830]
■N.G.K ఫుడ్స్‌ ప్రొడక్ట్స్‌ నందు పర్మినెంట్‌గా పని చేయుటకు డ్రైవర్లు, సేల్స్‌మెన్‌ కావలెను. అనుభవం కలిగినవారికి ప్రాధాన్యత. వివరములకు సంప్రదించండి: 95333 02084. [N-1227148]
■మెట్రో మెడికల్స్‌ & సర్జికల్స్‌ షాపులో పని చేయుటకు అనుభవం కలిగిన Pharmacists కావలెను. వివరములకు సంప్రదించండి: 96770 10777, 98869 88862. [N-787835]
■శ్రీరత్నం హాస్పిటల్‌లో పని చేయుటకు నర్సులు కావలెను. అర్హత: B.Sc నర్సింగ్‌/GNM/ఇంటర్‌ లేదా 10th పాసైన వారు. ఆకర్షణీయ జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 70935 31410. [NA-533]
■సెక్యూరిటీ ఫీల్డ్‌లో మార్కెటింగ్‌ & ఆపరేషన్స్‌ లలో అనుభవమున్న ఫీల్డ్‌ ఆఫీసర్‌ కావలెను. 30 వేలు జీతం+ 20వేలు ఇన్సెంటివ్స్‌& TA, DA. Mega Force Secutity, Nellore. 76800 77930. [NA-5283]
■KTMబైక్‌ షోరూం నందు పని చేయుటకు లేడీస్‌ & జెంట్స్‌ కంప్యూటర్‌ ఆపరేటర్స్‌ కం సర్వీస్‌ అడ్వైజర్స్‌ కావలెను. బయోడేటాతో సంప్ర. వేదాయపాళెం - నెల్లూరు. 70135 69269. [NA-1454]
■సేల్స్‌బాయ్స్‌ కం డెలివరీ బాయ్స్‌ కావలెను. (8గం॥లు డ్యూటీ-12వేలు, 10గం॥ డ్యూటీ-15వేలు జీతం. Qlf: 10th-Degree, Age: 20-30, Megamart, BV Nagar. 76800 77929. [NA-5281]
■మార్కెటింగ్‌ మేనేజర్‌ (Male) కావలెను. (8గం॥ డ్యూటీ-20వేలు జీతం+10వేలు ఇన్సెంటివ్స్‌ & TA) Qlf: Degree - PG, Age: 30-40. Mega mart, BV Nagar.Cell:76800 77931. [NA-5282]
■ప్రముఖ హాస్పిటల్‌ నందు పని చేయుటకు అనుభవం కలిగిన Nursing Staff, Pharma D Staff కావలెను. వివరములకు సంప్రదించండి: 93963 06769, 90107 77941. [NA-5277]

■నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల RKT పెట్రోలు బంకులో పనిచేయుటకు యువతి / యువకులు కావలెను. వివరాలకు సంప్రదించండి. సెల్‌: 95501 89885, 99082 99973. [NA-5266]
■ప్రముఖ ఇన్సూరెన్స్‌ కంపెనీలో ఉపాధి అవకాశం ఇన్సూరెన్స్‌ కంపెనీలో పని చేయుటకు ఇన్సూరెన్స్‌ కన్సల్టెంట్స్‌ కావలెను. మీ సంపాదన మీ చేతుల్లో. No Age Limit. Contact: 99593 42233. [NA-5265]
■నెల్లూరు, బజాజ్‌ సర్వీస్‌ సెంటర్‌ నందు పని చేయుటకు అనుభవము గల మెకానిక్‌ కావలెను. అనుభవము బట్టి జీతం కలదు. వివరాలకు సంప్రదించండి: 90329 59390. [NA-11217]
■నెల్లూరు, మినిబైపాస్‌రోడ్డు TDPఆఫీస్‌ ఎదురుగా HPCL పెట్రోల్‌ బంకులో పని చేయుటకు పంపు బాయ్స్‌ / గర్ల్స్‌ కావలెను. జీతం: 12,000/-. సంప్రదించండి: 89199 23469, 83418 28889. [NA-21624]
■కందుకూరులోని ప్రముఖ వైద్యశాలకు ల్యాబ్‌ టెక్నీషియన్లు మరియు నర్సింగ్‌ స్టాఫ్‌ కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆ 95056 12088, 90324 46303 [O-759015]
■మీ ఇంటి వద్దనే ఉంటూ మా కంపెనీ వ్యాపార ప్రకటనలు SMS చేయుటకు స్త్రీ / పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12000/-. ఫోన్‌: 72074 45296 [V- 5618]
■హరేకృష్ణ హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ. 18k. ఏజెంట్‌ కమీషన్‌ 3k. ఫోన్‌: 9640259988, 9640198899. [H-786821]
■VIP's ఇంట్లో పేషెంట్‌ ని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను, ఆయా, వార్డ్‌ బాయ్స్‌, నర్సులు, వంటవారు, Rmp. Dr. Q:5th-Degree, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995374999 [HA-898]
■జయభారత్‌ హాస్పిటల్‌ నెల్లూరు నందు పని చేయుటకు ANM, GNM, B.Sc. చదివి అనుభవం కలిగిన నర్సులు కావలెను. జయభారత్‌ హాస్పిటల్‌, నెల్లూరు. వివరాలకు సంప్రదించండి. 97034 41144, 809999 27250. [NA-5078]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్‌ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రమరించబడవు.

సాక్షి క్లాసిఫైడ్స్‌కు సంప్రదించండి
నాలుగు లైన్లకు ₹ 320/-
అదనపు లైనుకు ₹80/-
కలర్‌ ప్రకటనకు 25% అదనం
నెల్లూరు
90 1000 66 11



నేషనల్ గర్ల్ చైల్డ్ డే

# ఒక్క చిరునవ్వు... కోటి కాంతులు

అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే..
కూతురు అమ్మకు అమ్మ అవుతుంది.
నాన్న మనసుకు కష్టం కలిగితే..
కూతురు చేయి ఓదార్పు అవుతుంది.
ఈ పదేళ్లలో ప్రభుత్వాలు, ప్రజలలోనూ
బాలికలకు సంబంధించిన సమస్యలపై శ్రద్ధ పెరిగింది.
ప్రపంచ వేదికపై బాలికలు తమ గళాన్ని వినిపించడానికి
మరిన్ని అవకాశాలు పెరిగాయి.
అయినప్పటికీ, బాలికల హక్కులపై
అవగాహన పరిమితంగానే ఉంది.
బాలికలు తమ సామర్థ్యాన్ని నెరవేర్చుకోవడానికి
సమాజంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నారు
వారి అడుగులకు మరింత ఊతాన్ని ఇవ్వాల్సిన తరుణమిది.
'నేషనల్ గర్ల్ చైల్డ్ డే' సందర్భంగా
ఈ విషయంపై దృష్టి సారిద్దాం..

'కూతుళ్ళే మన భవిష్యత్తు' అనే మాటని మన ప్రధాని నరేంద్రమోదీ వివిధ సందర్భాలలో చెప్పడం పదే పదే విన్నాం. వివిధ రంగాలలో మహిళల విజయాలను గుర్తిస్తున్నాం. ఆడపిల్లల సాధికారతకు కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం. అయినా 'ఆమె' పురోగతికి కుటుంబం, సమాజం చేయాల్సిన కృషి ఎంతో ఉంది.

### కుటుంబంలో స్కీమ్స్

ఒకప్పుడు కూతురు ఇంటి గుండె మీద కుంపటి. ఇప్పుడు కుటుంబ సమస్యలను ఓ దరిచేర్చగల చుక్కాని. అందుకే పుట్టేది ఆడపిల్లైనా, మగపిల్లవాడైనా 'సరే' అనే దిశకు కుటుంబం చేరుకుందనే చెప్పాలి. కానీ, 'ఆమె' పెరుగుదలలో ఇంటి నుంచే ఎన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉంది. అందుకు తల్లితండ్రులే అమ్మాయిలను ప్రోత్సహించడానికి స్కీమ్స్ పెడుతుండాలి. ఆమె కలలకు, ఆశయాలకు మద్దతునివ్వాలి. ఎలాంటి సమస్య అయినా 'పరువు' అనే భయంతో కాకుండా బలమైన వెన్నుగా నిలవాలి.

### డిజిటల్ జనరేషన్, అవర్ జనరేషన్

ఈ నినాదం ఇప్పుడు బాలికలకు అత్యవసరమైనది. డిజటల్ యుగంలో 'ఆమె'కు వాటి వినియోగంలోనూ పూర్తి అవగాహన అవసరం. ఇప్పటికే అబ్బాయిలతో పోల్చితే అమ్మాయిలు డిజిటల్ పరికరాల వాడకంలో వెనకంజలో ఉన్నట్టు ప్రపంచవ్యాప్త అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. డిజిటల్ మాధ్యమం ద్వారా అమ్మాయిలను ప్రభావంతంగా మార్చే మానవ ఆసక్తి కథనాలు, బ్లాగ్‌లు, వీడియోలు, రీసోర్సింగ్ చేసే స్ఫూర్తిదాయకమైన నెట్‌వర్క్‌లు, సంస్థల గురించి తెలుసుకునే అవకాశాలను కల్పించాలి.

### చట్టం.. హక్కులు

సమాజంలో ధైర్యంగా, శక్తిమంతంగా ఎదిగేందుకు ఆమె చుట్టూ ఉన్న రక్షణ, న్యాయ వ్యవస్థల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు కుటుంబంతోపాటు ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనది.

### నాయకత్వాన్ని పెంచుదాం

**అవగాహన 'ఆమె'కు అవకాశాలను విస్తృతం చేస్తుంది. నాయకత్వాన్ని ఎంచుకునేలా ఎదగాలంటే ..**

- మన ప్రాంతంలోని అమ్మాయిలను వెనక్కి నెట్టివేసే అంశాల గురించి అవగాహన పెంపొందించడంలో, వాటిని పరిష్కరించడంలో ముందుండాలి.
- బాలికలకు అందాల్సిన సేవలను మరింతగా బలోపేతం చేయాలి. ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా వారి నాయకత్వం, చర్యలు, ప్రభావాన్ని సమష్టిగా విస్తరింపజేయాలి.
- ప్రపంచవ్యాప్తంగా బాలికలు లింగ అసమానత, వివక్షకు గురవుతున్నారనేది వాస్తవం. ఇవి బాలికలను ప్రతిచోటా వెనకడుగు వేయిస్తున్నాయి. అందుకే లైంగిక వేధింపులు, హింస, అసమానతలు, హక్కుల గురించి అవగాహన కల్పించడంలో వెనకంజ వేయకూడదు.
- విద్య, ఆరోగ్యం, పోషకాహార ప్రాముఖ్యతలను తెలియజేయడమే కాదు వాటిని అందించడంలోనూ ముందంజలో ఉండాలి.
- అమ్మాయిలు తమలోని ప్రతిభను కనబరచడమే కాకుండా పూర్తి స్వేచ్ఛతో జీవించే అవకాశాన్ని కల్పించాలి.
- చాలా ప్రాంతాలలో అమ్మాయిలను త్వరగా పెళ్లి చేసుకోమని బలవంతం చేయడం లేదు. అయినా, ఎలాంటి హింస జరిగినా ఆడపిల్లలకు తమ గొంతు వినిపించే హక్కు ఉంది. ఈ విషయాన్ని వారికి తప్పక తెలియజేయాలి.
- రోల్ మోడల్స్‌గా ఉన్నవారిని బాలికలకు పరిచయం చేయిస్తూ ఉండాలి. బాలికా నాయకత్వం పట్ల ప్రజలలో అవగాహనను పెంచాలి.
- అలజడులు, వలసలు, ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో సామాజిక సహాయ సేవలను పొందుతున్నప్పుడు బాలికలు అనుభవించే అసమానతలను పరిష్కరించడానికి అధికారులు, విధాన నిర్ణేతలు మరింతగా దృష్టి సారించాలి.

ఒక ఆడపిల్ల తన స్వచ్ఛమైన చిరునవ్వుతో ఇంటిని ప్రకాశవంతం చేస్తుంది. జీవితాన్ని ఎలా గడపాలో నేర్పేది ఆమె. కుటుంబంలో ప్రతి ఒక్కరినీ ప్రేమలో పడేలా చేసే స్వచ్ఛమైన ఆత్మ. కాబట్టి ప్రతి ఇంటినీ తన నిస్వార్థ ప్రేమతో, ప్రకాశంతమైన కాంతితో నింపే ఆమె భవిష్యత్తును ఉజ్వలం చేద్దాం. సమాజంలో సమానమైన అవకాశాలను కల్పించడానికి ప్రయత్నిద్దాం.

ఇందిరాగాంధీ 1966 జనవరి 24న దేశానికి మొదటి మహిళా ప్రధానమంత్రి అయ్యారు. అందుకే ప్రభుత్వం ఈ రోజుని జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకోవడానికి ప్రత్యేకంగా ఎంచుకుంది. భారత ప్రభుత్వం 2008లో ఆడపిల్ల పట్ల సమాజంలో చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం జనవరి 24ని జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది.

బాల్య ముద్రలు

# ఆ నీలి రంగు గౌను

బాల్యం మళ్లీ దొరకని
సీతాకోకచిలుక.
బాల్యం మనిషికి
తన అమలిన రూపాన్ని చూపే అద్దం.
బాల్యాన్ని తలుచుకోని వారు ఉండరు.
బాల్యం ఏర్పరిచే గాఢమైన ముద్రలే
మనిషి భవిష్యత్తు ప్రయాణాన్ని
ప్రభావితం చేస్తాయి.
'నా గురించి నేను
రాసుకోవాలనుకున్నప్పుడు
ఎన్ని సినిమాలు చేశాను,
ఎవరితో సినిమాలు చేశాను
రాయాలనిపించ లేదు.
నా బాల్యం గురించే రాసుకోవాలనిపించింది'
అంది నటి దీప్తి నావల్.
'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆమె
తన పుస్తకం 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'
గురించి మాట్లాడింది.
బాల్య జ్ఞాపకాలు పంచుకుంది.



'నాకు ఊహ తెలిశాక వచ్చే మొదటి జ్ఞాపకం... ఒక రోజు సాయంత్రం మా ఇంట్లో అమ్మ లేదు. జేజిని అడిగితే ఉత్తుత్తికే సినిమాకెళ్లిందిలే అంది. అమృత్‌సర్‌లో మా ఇల్లు హాల్ బజార్‌లో ఉండేది. సినిమా హాలు మా ఇంటి దగ్గరే. నేను ఇంట్లో నుంచి బయటకు గెంతి అమ్మ దగ్గరకు వెళతాను అని సినిమా హాలు వైపు పరిగెత్తాను. నాకు బాగా గుర్తు. అప్పుడు గాలి దుమారం రేగింది. వీధిలో చెత్త పైకి రేగింది. షాపులు దుమ్ముతో నిండిపోయాయి. నేను మాత్రం హాలు వైపు పరిగెడుతూనే ఉన్నాను. నా వెనుక మా జేజీ. ఆ గాలిలో అర్థమయ్యీ కాక ఎటు వెళ్లేదాన్నోగాని మా జేజి గబుక్కున నన్ను జవురుకొని ఇంటికి తీసుకెళ్లింది. తీసుకెళ్లాక ఆమె అన్న మాట– మంచి ఇంటి ఆడపిల్లలు సినిమా కు వెళ్లకూడదమ్మా అని. ఏ ముహూర్తాన ఆమె ఆ మాట అన్నదో (నవ్వు). నా జీవితం మొత్తం సినిమాల్లోనే గడిచింది'....

•••

'సినిమాల్లో నేను ఎన్నో కాస్ట్యూమ్స్ తొడుక్కుని ఉంటాను. రోజువారీ జీవితంలో ఫ్యాషన్లు ఫాలో అయి ఉంటాను. కాని నాకు ఇష్టమైన బట్టలు అంటే చిన్నప్పుడు నేను తొడుక్కున్న నీలి రంగు గౌనే. ఆ కథ నాకు చాలా ఇష్టం.

అప్పుడు నాకు పదేళ్లు ఉంటాయి. మా ఇంటికి ఏదో మేగజీను వచ్చేది. అందులో ఒక అడ్వర్టయిజ్‌మెంట్‌లో ఇద్దరు పాపలు ఒకే లాంటి నీలి రంగు గౌన్‌లలో నిలబడి ఉంటారు. మా అమ్మ ఆ ఫొటో చూసి' పండక్కు ఇలాంటి గౌన్లు వేయాలి మీకు' అంది నాతో మా అక్కతో. దీపావళి పండగ దగ్గర్లో ఉంది. దీపావళికి కొత్త బట్టలు తొడుక్కుని టపాకాయలు కాల్చడం ఆనవాయితీ. మా అమ్మ ఇంట్లో ఒక తెల్ల గుడ్డ ఉంటే మమ్మల్ని తీసుకుని అద్దకం దుకాణానికి తీసుకు వెళ్లింది. మేగజీన్‌లోని ఫొటో చూపించి ఆ బట్టకు అదే రంగు నీలం వేయమని చెప్పింది. అతడు తలాడించాడు. మామూలు నీలం కాదు ఇది... పర్షియన్ నీలం... అలాగే ఉండాలి అంది మా అమ్మ. అతను మళ్లీ సరే అన్నాడు. మొత్తం మీద నీలంగుడ్డ మా ఇల్లు చేరింది. ఇక గౌనుగా మారాలి.

మా అమ్మకు బట్టలు కుట్టడం ఆసక్తే అయినా పండగ బట్టలు కాబట్టి మా వీధిలో ఉండే శిక్కు దర్జీకి ఇచ్చింది. ఆయన అప్పటికే కుప్పలు తెప్పలుగా పండగ గుడ్డలు కుట్టే పనిలో ఉన్నాను. పండక్కు ఇస్తానని మాట ఇచ్చాడు. మా ఇంటి నుంచి ఆ దర్జీ షాపు కనిపిస్తుంది. నేను మా అక్క రోజూ షాపు వైపు చూసేవాళ్లం. షాపు దాకా వెళ్లి మా గుడ్డ కదిలిందో లేదో చూసేవాళ్లం.

పండగ వచ్చింది. సాయంత్రమైపోయింది. అందరూ టపాకాయలు కాల్చడం మొదలెట్టారు. మేమిద్దరం మాకు చేరని నీలి రంగు గౌన్లను తలచుకుని మొహం మాడ్చుకుని కూచున్నాం. టపాకాయలు కాల్చలేదు. ఏడూ ఎనిమిది అయిపోయింది. మా బజార్‌లో షాపులన్నీ మూత పడిపోయాయి. దర్జీ షాపు లైటు ఒక్కటే వెలుగుతూ ఉంది. ఆ తర్వాత భోజనాలు చేశాం. వీధిలో టపాకాయల మోత ఆగిపోయింది. మేము పైజామాల్లోకి మారి నిద్రపోబోతున్నాం. అప్పుడు మా ఇంటి గేటు తట్టిన చప్పుడు అయ్యింది. నేను పరిగెత్తాను ఎవరొచ్చారో అర్థమయ్యి. ఆలస్యానికి మన్నింపు కోరుతున్న ముఖంతో రెండు నీలం రంగు గౌన్లు పట్టుకుని దర్జీ.

ఓ.. మేము వెంటనే ఆ గౌన్లు తొడుక్కుని అప్పుడు పండగ మొదలెట్టాం. టపాకాయలు కాల్చి వీధి వీధంతా నిద్ర లేపాం. పదే పదే నేను ఇష్టంగా తలచుకునే జ్ఞాపకం ఇది.

•••

మా అమ్మ అప్పుడప్పుడు పొరుగునే ఉన్న పేదపిల్లల బడికి వెళ్లి పాలు పంచి వచ్చేది. ఒకరోజు అమ్మతో పాటు నేనూ వెళ్లాను. చాలా మంది చిన్న పిల్లలు అమ్మ దగ్గరకు వచ్చి ఆమె పంచుతున్న పాలు తీసుకుని తాగి సంబర పడ్డారు. మేము తిరిగి వస్తుంటే ఒక పిల్లాడు పరిగెత్తుకుంటూ గిన్నె పట్టుకుని వచ్చాడు. 'అయ్యో... నాన్నా పాలు అయిపోయాయి. ఇంత ఆలస్యం ఏంటి?' అంటే వాడు నిరాశ నిండిన ముఖంతో 'మా ఇంట్లో గిన్నె లేదు. అమ్మ వేరే ఇంటి నుంచి తెచ్చి ఇచ్చింది' అన్నాడు.

మన దేశ పేదరికం గురించి నా మనసు మీద శాశ్వత ముద్ర వేసిన సంఘటన అది.

•••

నాకు పద్నాలుగేళ్లు ఉండగా నా స్నేహితురాలికి మానసిక ఆరోగ్యం దెబ్బ తింది. ఆ రోజుల్లో పిచ్చి పట్టడం అంటే వారిని బహిష్కరించడమే. ఆ అమ్మాయికి అలా కావడంతో నేను చాలా డిస్ట్రబ్ అయ్యాను. ప్రతి వీధిలో చాలామంది ఆడవాళ్లు అలాంటి స్థితిలో కనిపించేవారు. మేము జట్కాలో స్కూలుకు వెళుతుంటే ఒకామె మా వెనుకే పరిగెత్తేది. నాకు చాలా బాధ కలిగేది. వారికి ఏదైనా చేద్దామనే నేను అమెరికాలో సైకాలజీ చదివాను. ఇప్పటికీ నేను మానసిక ఆరోగ్యం సరిగా లేని స్త్రీల గురించి ఆలోచిస్తాను. వారికి నేటికీ సరైన వైద్యం అందడం లేదు. నేను నా కవిత్వ పుస్తకంలో ఎన్నో కవితలు మానసిక ఆరోగ్యాన్ని కోల్పోయిన స్త్రీల గురించి రాశాను. రాస్తాను.

దీప్తి నావెల్ జీవితంలోని ఇలాంటి అనేక అంశాలు 'ఏ కంట్రీ కాల్డ్ చైల్డ్‌హుడ్'లో ఉన్నాయి.

– జైపూర్ నుంచి సాక్షి ప్రతినిధి

# అమృత్ పత్తి అదుర్స్!






మొదటి రెండు వరుసల మధ్య 4 అడుగులు, తర్వాత రెండు వరుసల మధ్య 6 అడుగుల దూరం చొప్పున పాటించి సాగు చేసిన పత్తి చేను



పత్తి తొలి దశలో మొక్కకు ఎక్కువగా వచ్చిన కొమ్మలు.. కాయలను చూపుతున్న రైతు విజయ్ (ఫైల్)

**ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి సాధించిన ఆదిలాబాద్ జిల్లా రైతు**

**మహారాష్ట్రకు చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ రూపొందించిన పద్ధతి ఇది**

పత్తి దిగుబడుల పరంగా ఎకరానికి 20 క్వింటాళ్లు సాధించిన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం కొల్హారికి చెందిన యువ రైతు ఫడ్ విజయ్ ఆదర్శంగా నిలుస్తున్నారు. రెట్టింపు దిగుబడి సాధించిన విషయం ఆ నోటా ఈ నోటా తెలుసుకొని పరిసర గ్రామాల రైతులు ఆసక్తిగా పొలాన్ని చూసి వెళ్తున్నారు. సాధారణ సాగులో కొంత మందికి 6 నుంచి 8 క్వింటాళ్లు, మరికొంత మందికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అయితే, ఈ రైతు ఏకంగా రెట్టింపు కంటే అధిక దిగుబడి సాధించడమే రైతులను ఆకర్షిస్తోంది.

ఫడ్ విజయ్‌కు మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా అంబోడ గ్రామంలో చుట్టాలు ఉన్నారు. ఒకసారి ఆ గ్రామానికి వెళ్లినప్పుడు అక్కడ అమృత్ ప్యాటర్న్‌లో సాగు చేయడాన్ని గమనించాడు. దిగుబడి అధికంగా వస్తుందని ఆ రైతులు చెప్పడంతో ఆ వైపు మొగ్గు చూపాడు.

### అమృత్ పద్ధతి అంటే..?

యవత్‌మాల్ జిల్లా మహాగావ్ తాలూకా అంభోద గ్రామానికి చెందిన రైతు శాస్త్రవేత్త అమృత్‌రావు దేశ్‌ముఖ్ తన క్షేత్రంలో అనేక ఏళ్ల పాటు ప్రయోగాలు చేసి ఈ సాగు పద్ధతిని రూపొందించారు. అందువల్లనే అమృత్ ప్యాటర్న్ అని పేరు వచ్చింది. ఏకంగా 50 క్వింటాళ్ల వరకు ఎకరంలో పత్తి దిగుబడి సాధించిన ఘనత ఆయనిది.

ఆదిలాబాద్ జిల్లాలో సాధారణంగా పత్తి సాగులో రైతులు మొక్కల మధ్య కొంచెం అటూ ఇటుగా ఒక అడుగు, వరుసల మధ్య 3 నుంచి 4 అడుగులు లేదా 4 నుంచి 5 అడుగుల దూరం పాటిస్తారు. అమృత్ ప్యాటర్న్‌లో మొక్కల మధ్య దూరం కచ్చితంగా ఒక అడుగు ఉండే చూస్తారు. ఒక వరుస మధ్య 4 అడుగులు, ఆ పక్కన వరుస మధ్య దూరం 6 అడుగుల దూరం పాటిస్తారు. అంటే.. మొదటి రెండు వరుసల మధ్య దూరం నాలుగు అడుగులు.. రెండు, మూడు వరుసల మధ్య ఆరు అడుగుల దూరం అనుసరిస్తారు. ఇదే తీరులో చేనంతా పాటిస్తారు. ఇదే విధానాన్ని విజయ్ అవలంభించారు.



ఏడు అడుగులు పెరిగిన పత్తి చేనులో విజయ్

### తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

అమృత్ పద్ధతిని అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధ్యమవుతుంది. ఎరువులు, పురుగుల మందులు ఎక్కువగా వాడే అవసరం పడదు. కలుపు తీయడంతో పాటు ఎరువులు, మందుల ఖర్చుల్లో చాలా ఆదా అవుతుంది. అధిక సాంద్రతతో పూత, కాత రావడం జరుగుతుంది.

– సాయిప్రణీత్ (96768 83233), వ్యవసాయ విస్తరణాధికారి, కొల్హారి గ్రామం



### నెల తర్వాతే ఎరువులు..

పత్తి సాగులో మొదటి నెల రోజుల పాటు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు వాడలేదు. ఇలా చేయటం వల్ల మొక్కకు కొమ్మలు ఎక్కువగా వస్తాయి. విత్తిన నెల తర్వాత ఎకరాకు ఒక బ్యాగు 10:26:26 వేశారు. ఆ తర్వాత నెలలోనూ అదే మోతాదులో అదే ఎరువుతో పాటు అతి తక్కువ ధరకు లభ్యమయ్యే పురుగుల మందు వాడినట్టు వివరించారు. మూడో నెల తర్వాత 5 కేజీల సల్ఫర్, ఆ తర్వాత 25 కేజీల మెగ్నీషియం నెలకు అందిస్తే సరిపోతుందని విజయ్ తెలిపారు. తద్వారా ప్రతి మొక్కకు వచ్చే కొమ్మలైనా ప్రధాన కొమ్మ, పిల్ల కొమ్మలు చాలా తక్కువ దూరంలో వస్తాయని తెలిపారు. పూత, కాత ఎక్కువగా రావడంతో పాటు రాలిపోకుండా ఉంటాయని విజయ్ వివరించారు.

సాళ్ల మధ్య ఎక్కువ దూరం పెట్టడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి అధిక దిగుబడి వస్తోంది. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని అనుభవపూర్వకంగా విజయ్ చెబుతున్నారు. ఎకరానికి రూ. 20 వేలు ఖర్చయ్యింది. 20 క్వింటాళ్ల పత్తి తీసిన తర్వాత మళ్లీ నీటి తడి ఇచ్చారు. ఫలితంగా మున్ముందు కూడా మరికొంత పత్తి దిగుబడి రావచ్చని విజయ్ ఆశిస్తున్నారు.

– గొడిసెల కృష్ణకాంత్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్, సాక్షి, ఆదిలాబాద్.

### సాగు పద్ధతి మార్చుకొని అధిక దిగుబడి సాధించా...

రెండేళ్ల కింద పత్తి సాగులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. మహారాష్ట్రలో కొంతమంది రైతులు అవలంభిస్తున్న అమృత్ ప్యాటర్న్‌లో గతేడాది పత్తి సాగు చేశాను. కొన్ని కాయలు కూడా కుళ్లిపోయాయి. అప్పుడు 9 నుంచి 11 క్వింటాళ్ల మధ్య దిగుబడి వచ్చింది. అమృత్ విధానాన్ని పూర్తిస్థాయిలో పాటించకపోవడంతో దిగుబడి అంతకు పరిమితమైంది. రెండో ఏడాది.. గడిచిన వానా కాలంలో ఈ విధానంలో అమృత్ ప్యాటర్న్‌లో అన్ని పద్ధతులను పూర్తిస్థాయిలో అవలంభించాను. ఎకరానికి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది.

– ఫడ్ విజయ్ (77024 42958), ఇన్నోవేటివ్ పత్తి రైతు, కొల్హారి గ్రామం, గుడిహత్నూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా

సాగుబడి
శ్రావణ కార్తె
జనవరి 24 నుంచి

# మొబైల్ ఈవీ కూరగాయల కూలర్!

- తెలంగాణ నాబార్డ్ తోడ్పాటుతో రూపొందించిన పుణే స్టార్టప్ రుకార్ట్
- రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయం 150% పెరిగే అవకాశం

చిన్న, సన్నకారు కూరగాయలు, పండ్ల రైతుల ఆదాయం పెంపొందించే లక్ష్యంతో మహారాష్ట్ర పుణేకు చెందిన నలుగురు ఐఐటీయన్లు 'రుకార్ట్' పేరిట స్టార్టప్ సంస్థను స్థాపించి ఏ రకమైన విద్యుత్తూ అవసరం లేని కూరగాయలు, పండ్లను నిల్వ ఉండే కూలర్‌ను రెండేళ్ల క్రితమే రూపొందించారు. ఇప్పుడు విద్యుత్ బ్యాటరీతో నడిచే వ్యాన్‌కు సబ్జీ కూలర్‌ను నాబార్డ్ తోడ్పాటుతో అనుసంధానించారు.

సబ్జీ (కూరగాయల) కూలర్‌లో వంద కిలోల ఆకుకూరలు, పువ్వులు, కూరగాయలను 4 నుంచి 6 రోజులు తాజాదనం పోకుండా నిల్వ చేయవచ్చు. అందుకు ఈ సబ్జీ కూలర్‌కు కావాల్సింది రోజుకు 20 లీటర్ల నీరు మాత్రమే. ఎటువంటి విద్యుత్తూ అవసరం లేదు. పర్యావరణ అనుకూలమైన 'మెరుగైన ఆవిరి శీతలీకరణ' ఆధారిత ఆటోమైజ్డ్ కోల్డ్ స్టోరేజీని రుకార్ట్ సంస్థ అందిస్తోంది.

ప్రత్యేక మెటల్‌తో తయారు చేసిన సబ్జీ కూలర్ గోడలోకి నీరు పోయాలి. బయటి వాతావరణంలో వేడి వల్ల ఈ నీరు ఆవిరవుతూ లోపలి కూరగాయలకు చల్లదనాన్నిస్తుంది. ఇది ఉద్యాన ఉత్పత్తులను తాజాగా నిల్వ ఉంచడానికే కాదు.. అరటి, నిమ్మ, మామిడి, బొప్పాయి మొదలైన పండ్లను సహజంగా మగ్గబెట్టే గదిగా కూడా పనిచేస్తుందని తయారీదారులు చెబుతున్నారు.

సబ్జీ కూలర్ అరెకరం కూరగాయల లేదా పండ్ల తోట ఉన్న రైతుకు లేదా తన ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే రైతుకు అనుకూలంగా ఉంటుంది. దీన్ని పొలం దగ్గర లేదా ఇంటి దగ్గర లేదా మార్కెట్‌లో ఆరుబయట, గోదాములలో సులువుగా ఏర్పాటు చేసుకోవచ్చు. 5 రాష్ట్రాల్లో రైతులు, బెంగళూరులోని సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్స్ కంపెనీ, ఏలూరులోని హరిత మిత్ర వంటి ఎఫ్.పి.ఓ.లు, రిటైల్ అమ్మకందారులు ఇప్పటికి 425 సబ్జీ కూలర్లను ఉపయోగిస్తున్నారు.



మొబైల్ ఈవీ సబ్జీ కూలర్




సబ్జీ కూలర్

### మొబైల్ కూలర్‌తో మరింత ఆదాయం

తెలంగాణ నాబార్డు ఆర్థిక తోడ్పాటుతో రుకార్ట్ సంస్థ విద్యుత్ బ్యాటరీతో నడిచే మొబైల్ సబ్జీ కూలర్ వ్యాన్‌ను రూపొందించింది. సిద్దిపేట జిల్లా ములుగులోని రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్.పి.ఓ.)లో ఈ నెల 23న దీన్ని ఆవిష్కరించారు. తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్ముకొనే రైతులు, ఎఫ్.పి.ఓ.ల ఆదాయాన్ని 150% పెంపొందిస్తుందని మొబైల్ ఎలక్ట్రిక్ సబ్జీకూలర్ వ్యాన్ దోహదపడుతుందని రుకార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన వికాస్ ఝా తెలిపారు.

మొబైల్ సబ్జీ కూలర్ పూర్తి చార్జింగ్‌తో గంటకు 25 కి. మీ. వేగంతో వంద కి.మీ. నడుస్తుంది. 350 కిలోల వరకు బరువు మోస్తుంది. కూరగాయలు, పూలు, ఆకు కూరల రంగు, తాజాదనం, దృఢత్వాన్ని కాపాడుతుంది. వృథాను 15% అరికడుతుంది. దీనిపై పెట్టే పెట్టుబడిని 7 నెలల్లోనే తిరిగి రాబట్టుకోవచ్చని వికాస్ ఝా వివరించారు. వివరాలకు.. 88790 49787, 88956 341918.

### మార్చి నుంచి మెత్తళ్ల/పరిగెల సీడ్ సరఫరా



విటమిన్ 'ఎ' తదితర పోషకాలు పుష్కలంగా ఉండే చిరు చేపలు మెత్తళ్ల (పరిగెల) విత్తనోత్పత్తిలో శాస్త్రవేత్తలు సాధించిన విజయం గురించి ఈ నెల 10న 'సాక్షి సాగుబడి' కథనం ద్వారా తెలుసుకున్నాం కదా. మెత్తళ్ల సీడ్ మనకు ఎప్పటికి చేతికి అందుతుందీ అని పలువురు రైతులు ఆత్రుతను వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో సీడ్ ఉత్పత్తి చేసిన హేచరీని 'సాక్షి' ఫోన్ ద్వారా సంప్రదించింది. మార్చి నెల నుంచి సీడ్‌ను విక్రయిస్తామని ఒడిషాలోని బిశ్వాల్ ఆక్వా ఫామ్ అండ్ హేచరీ అధిపతి సౌరబ్ కుమార్ బిస్వాల్ 'సాక్షి'కి తెలిపారు. జగత్సింగ్‌పూర్ జిల్లా తులంగ గ్రామంలో ఈ హేచరీ ఉంది. భువనేశ్వర్ నగరానికి 100 కి.మీ. దూరంలో తారాదీప్ వెళ్లే మార్గంలో తులంగ ఉంటుంది. మెత్తళ్ల ఫిష్ స్పాన్ (50–60 గంటల వయసున్న పిల్లలు)ను మార్చి మొదటి వారం నుంచి రైతులకు విక్రయిస్తారు. లక్ష స్పాన్ ధర రూ. 1,500. ఫ్రై (10–15 రోజుల పిల్లలు)ని మార్చి 15 నుంచి సరఫరా చేస్తారు. వెయ్యి ఫ్రై ధర రూ. 200. ఆగస్టు–సెప్టెంబర్ వరకు మెత్తళ్ల సీడ్ ఉత్పత్తి, సరఫరా జరుగుతుంది. పాలిథిన్ బ్యాగ్‌లలో చేప పిల్లలను ఆక్సిజన్‌తో పాటు నింపి సిద్ధం చేసిన తర్వాత 30 గంటల్లోగా గమ్యం చేర్చాలని బిస్వాల్ తెలిపారు. రోజూ ఆంధ్రప్రదేశ్‌కు 10–15 ఇన్సులేటెడ్ వ్యాన్లు వెళ్తూ ఉంటాయని, వాటిలో మోల సీడ్‌ను తరలించవచ్చన్నారు. ఇతర వివరాలకు.. 93376 62527.

### 26 నుంచి సేంద్రియ సాగు, విలువ జోడింపుపై 3రోజుల శిక్షణ

సేంద్రియ సాగు విధానం, అందుకు అవసరమైన కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన పంటలకు విలువ జోడింపుపై ఈ నెల 26, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడు గ్రామంలోని రైతు శిక్షణా కేంద్రంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో 3 రోజుల రైతు శిక్షణా కార్యక్రమం జరగనుంది. ఉ. 10 నుంచి సా. 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన రైతులు 97053 83666, 95538 25532 ఫోన్ నెంబర్లలో తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భోజనం, వసతి సదుపాయం ఉంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న 30 మంది ఏపీ రైతులకే ఈ అవకాశం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్